

ఎనిమిదవ భాగము

డెల్లా నిద్రపోయింది. గంటసేపు గడిచింది. ఇంకా ముందుకు కదిలిపోవడం మంచిదనిపించింది. మేము వచ్చిన హెలికాప్టర్ గుర్తొచ్చింది. అందులో ఇంకా గాసోలిన్ వుంది కొద్దిగా. అదే ఈ దీవినుండి తప్పుకునేందుకు మాకు శరణ్యం. దాంతో మళ్లా సముద్రంపైన పడదామనుకున్నాను. అదృష్టం బాగుండి ఏదైనా షిప్ కనుపిస్తే ఎలాగో తంటాలుపడి దాన్లో ఎక్కగలిగితే ఏదో ఒక దేశానికి చేరుకోవచ్చు.

డెల్లాను నిద్రలేపాను. కళ్ళు నులుముకుని లేచింది. వేళ్ళతోనే వెంట్రుకల్ని దువ్వుకొన్నట్లు సరిచేసుకుంది.

“ఏంచేద్దాం!” అడిగింది.

నా ఆలోచన చెప్పాను. ఆమెకూడా అంగీకరించింది.

ఇద్దరం మళ్ళీ నడక మొదలెట్టాం. ఎటుపోతున్నదీ మాకు అర్థంకావడంలేదు. మా హెలికాప్టర్ ఎక్కడుందీ

తెలియడంలేదు. ప్రొద్దు తరిగిపోతూ వుంది. చీకటి పడ్డాక మా ప్రయత్నం ప్రయోజనహీనమవుతుంది.

రాత్రిపూట హెలికాప్టర్‌లో సముద్రంపైకి వెళ్ళటం ప్రమాదం. క్రిందేముందో కనుపించదు. ఏదైనా షిప్ కనుపించినా మేము దాన్ని చేరుకోవడం కూడా కష్టమే. దానికి తోడు గాసోలిన్ ఎక్కువగాలేదు దానిలో.

కొంతదూరం పోయాక ఆగాం.

డెల్లాను తుపాకీ పట్టుకొని ఒక పొడవుపాటి చెట్టు దగ్గర నిలుచోమని చెప్పి, నేను పైకి ఎక్కాను.

దాదాపు ఫర్లాంగు ఎత్తుంది అది. కొమ్మలులేవు. చెట్టు పైభాగాన గుబురులా వుంది. అది కొబ్బరిచెట్టు కాదు, తాటి చెట్టులాగలేదు. కానీ ఆ జాతికి చెందినదే.

నాకు ప్రాకుతూ చెట్లెక్కే అలవాటులేదు. పొట్ట భాగమంతా, మోకాలు ఒరుసుకుని చర్మం చిట్లి అక్కడక్కడా చిన్న గాయాలయినాయి. చేతులు దోక్కుని పోయాయి. అలాగే ఊపిరి బిగదీసుకుంటూ, క్రిందకు జారిపోకుండా, మెల్లగా, అంచెలంచెలుగా చెట్టు పై చివరకు చేరుకున్నాను.

అక్కడ్నుంచి చుట్టూవున్న ప్రదేశమంతా నాకు బాగా కనుపించసాగింది. మేము హెలికాప్టర్ ఆపిన ప్రదేశంకూడా, ఎడమవేపు దూరంగా కనుపించింది. కళ్ళతోనే ఎన్ని డిగ్రీలలో, ఏవైపున, ఎంత దూరంలో ఆ ప్రదేశం వుందో అంచనా వేసుకొన్నాను. మళ్ళా చుట్టూ ఎవరయినా మనుషులు కనుపిస్తారేమోనని చూశాను. ఎవ్వరిజాడలేదు. క్రిందికి దిగడం మొదలెట్టాను. చాలా సులభంగానే వుంది.

"బ్రతికి బయటపడే దారేదైనా దొరికిందా?" అడిగింది డెల్లా నిరాశగా, నిర్లిప్తతతో కూడుకున్న స్వరంతో.

"అలా బెంబేలుపడకు. మన హెలికాప్టర్ కనుపించింది. దానిదగ్గరకు వెళ్దాం" అన్నాను.

"కనుపించిందా అదున్న స్థలం?" అడిగింది ఉత్సాహంగా.

"ఆ! ఒక మైలు నడవాల్సి వుంటుంది" అన్నాను.

"పది మైళ్ళయినా నడుస్తాను" అంది ముందు కడుగు వేస్తూ డెల్లా.

ఇద్దరం ఒకరి వెనుక ఒకరం, చెట్లనడుమ, తీగలు తప్పుకుంటూ, దారి చూసుకుంటూ, చేసుకుంటూ నడిచాం. గంట తర్వాత అక్కడకు చేరాం.

నేను హెలికాప్టర్ వైపు చూశాను.

నా కళ్ళు తిరిగిపోయాయి. మొత్తాన్ని ముక్కలు ముక్కలుగా చేసిపెట్టారు. చక్రాలు దూరదూరంగా పడున్నాయి. లావుపాటి రాళ్ళు దానిచుట్టూ పడున్నాయి. దగ్గరగా వెళ్ళాను. వైర్లన్నీ లాగిపారేశారు. స్టీరింగ్ విరగ్గొట్టారు.

"ఇది దేనికీ పనికిరాదు. బలముండి మోసుకుపోతే పాత ఇనుపసామాను క్రింద అమ్ముకోవచ్చు" అంది డెల్లా.

"అవును! నిజమే!!" దానివైపు విస్మయంగా చూస్తూ అన్నాను.

"ఎవరు ఎందుకు ఇలా చేసివుంటారు?"

"ఏమో? మనల్ని బంధించిన రాబందులు ఈ ఘాతకం జరిపివుండాలి. ఎందుకలా చెయ్యవలసి వచ్చిందో అర్థం కాలేదు" అన్నాను.

"అయితే మన భావి కార్యక్రమమేమిటి?" అంది డెల్లా విచారంగా.

"ఆలోచిస్తున్నాను. ఏదిఏమైనా మన మీ ప్రాంతాల్లో వుండటం క్షేమంకాదు. ఏ క్షణంలోనైనా ఆ రాక్షసులు

మనల్ని వెతుక్కుంటూ ఇక్కడికొచ్చే ప్రమాదముంది. అందువల్ల దూరంగా అదుగో అటు సముద్రంవైపు పోదాం. ఆ ఇసకలోనే రాత్రికి వంతులవారీగా పడుకుందాం. తెల్లారాక ఏంచెయ్యాల్సిందీ తేల్చుకుందాం!'' అన్నాను.

''ఓ. కే!'' అంది డెల్లా.

అక్కడ్నుంచి ఇద్దరం బయలుదేరాం. సముద్రంవేపు నడక ప్రారంభించాం.

సముద్రపు ఒడ్డు చేరాం. చీకటి అప్పుడప్పుడే ముసురు కుంటూంది.

గడియారంకేసి చూసుకున్నాను. ఒంటిగంటయింది. అదే ఇండియా అయితే సాయంత్రం ఆరుగంటలయి వుండేది. అంటే మేము ఏడుగంటలు ముందున్నాం. దాన్ని బట్టి భూమధ్యరేఖకు ఎంత దూరంలో మేము ఉండి వుంటామో ఉజ్జాయింపుగా లెఖవేశాను. అమెరికాకు చుట్టుప్రక్కల దూరంగా ఎక్కడో వున్న దీవిలో వుండి వుండాలనిపించింది నాకు.

సముద్రపు గాలి ఉప్పగా తగిలింది నోటికి. అలలు హోరుమంటూ గోలచేస్తున్నాయి. మేము ఇసుకలో కూల బడ్డాం. డెల్లా లేచి సముద్రం దగ్గరకు వెళ్ళింది. తర్వాత ఐదునిముషాల్లో తిరిగొచ్చింది.

''ఏంచేశావ్?'' అడిగాను.

''కాస్త ఒళ్ళు, కాళ్ళు, చేతులు కడుక్కుని ఆ ఉప్పు నీళ్ళే రెండు గ్రుక్కలు త్రాగాను. దాహం ఆగలేదు. ఇపుడు నీళ్ళు అంత ఉప్పగా లేవు'' అంది.

''ఉండవు. మనం మూడ్రోజులనుంచి ఈ ఉప్పుగాలి లోనే వున్నాంగా!?'' అన్నాను.

ఇద్దరం సిగరెట్లు ముట్టించుకున్నాం. ఇసుకలోనే పడుకుని దమ్ముకొడుతూ ఆకాశంకేసి చూస్తూ ఒకరి

కొకరికి సంబంధం లేనట్లు ఆలోచనలు చేసుకుంటూండి పోయాం. అరగంట అలానే గడిచిపోయింది.

"డెల్లా!" పిలిచాను.

ఆమె పలుకలేదు. లేచి తలత్రిప్పి చూశాను.

మంచి నిద్రలో వుంది. నేను ఆలోచిస్తూ కూర్చున్నాను. ఒక గంట గడిచింది. దూరంగా ఏవో అరుపులు, కేకలు వినొచ్చాయి. రక్కున లేచి నిల్చున్నాను.

తుపాకీ పట్టుకొని చుట్టూ చూశాను. అంతా చీకటి. ఏమీ కనుపించలేదు.

డెల్లాను తట్టి లేపాను.

ఉలిక్కిపడి లేచి కూర్చుని "ఏమయింది?" అడిగింది.

కలకలం గురించి చెప్పాను. తను విని "అవును. దూరంగా ఎవరో అరుచుకుంటూ వస్తున్నారు" అంది.

"ఆ అడవి మనుషులై వుంటారు. గూడెం చేరాక మనం తప్పించుకుని పోయిన విషయం తెలిసుంటుంది. వెతుక్కుంటూ వస్తున్నారులాగుంది. మనమేం చేద్దాం?" అన్నాను.

"తుపాకీలున్నాయిగా? ప్రాణాలున్నంతవరకు యుద్ధం చేద్దాము?" అంది డెల్లా ధైర్యంగా.

"కానీ ఇక్కడుండి లాభంలేదు. మనం సముద్రంలోకి పోదాం. నీళ్ళల్లో నిలబడి పోరాడుదాం. వాళ్ళనుండి తప్పించుకునేందుకు వీలుంటుంది" అన్నాను.

నా సలహాకు సమాధానంగా తుపాకీ పట్టుకుని లేచింది.

ఇద్దరం వడివడిగా సముద్రంవేపు పరుగెత్తాం. ఒక పెద్ద బండరాయి చాటు నిల్చున్నాం.

మమ్మల్ను అంతకుముందు పట్టుకున్న గుంపే వచ్చింది.

వాళ్ళమీదకు గురిపెట్టి తుపాకీ పేల్చాను. గుంపంతా దూరంగానే నిలబడింది.

బాణాలు ఎక్కుపెట్టారు. అమ్ములు ముందుకు వచ్చి పడ్డాయి. బరిసెలు విసిరారు. మేము మొల్లోతు నీళ్ళల్లో నిలబడ్డాం. వాళ్ళు మొత్తం ఒడ్డుపైన వున్నారు. మేము మరో రెండు రౌండ్లు కాల్చాం.

వాళ్ళల్లో వాళ్ళు కాసేపు సంప్రదించుకుంటూండి పోయారు కాసేపు.

నలుగురు మనుషులు నీళ్ళవైపు పరుగెత్తారు.

ప్రాణాలు పోయినాసరే మమ్మల్ని పట్టుకునేందుకు వాళ్ళు సన్నద్ధులైనట్లుంది. వాళ్ళని దగ్గరకు రానియ్యడం నా కిష్టంలేదు. తుపాకీ గురిపెట్టి కాల్చాను. ఒకడి గుండెల్లోంచి దూసుకుపోయింది. పెద్ద కేకపెట్టి నీళ్ళల్లోనే పడిపోయాడు. అతని ప్రక్కనున్న ముగ్గురూ వెనుకంజ వేశారు.

డెల్లా తుపాకీ ఎత్తింది కాల్చేందుకు. నేను ఆమెను కాల్పులు ఆపమన్నాను. మా దగ్గరున్న మందు సామగ్రి కొద్దిపాటే. అనవసరంగా ఖర్చుపెట్టడం నా కిష్టంలేదు. వాళ్ళల్లో ఒక మనిషి చనిపోయాక భయపడి వెనక్కి వెళ్ళిపోతే, మిగిలిన కొద్దిపాటి అమ్యునిషనన్నా దక్కుతుంది. మరోమారు ఆపదలో అందుబాటుకొస్తుంది.

నేను వాళ్ళను గమనించసాగాను. వాళ్ళ నాయకుడు ఏదో చెప్పాడు. నీళ్ళల్లోపడ్డ మనిషి శవాన్ని లాక్కుని వెనక్కు వెళ్ళిపోయారు.

అందరూ సముద్రపు ఒడ్డుకు చేరారు.

నేనూ, డెల్లా వాళ్ళను గమనిస్తూ నీళ్ళల్లో నిల్చున్నాం.

వాళ్ళు అక్కడ్నుంచి ముందుకు రావడంలేదు. వెనక్కి వెళ్ళడంలేదు. ఏం చెయ్యాలనుకుంటున్నారో ఊహించలేకపోయాను.

అందరూ వరుసగా బరిశెలు చేతో పట్టుకుని ఒడ్డునే

లైనుగా నిలబడ్డారు.

"మనం నీళ్ళలోంచి వెలుపలికి రాగానే పట్టుకుందామని సిద్ధంగా నిల్చబడ్డారు" అంది డెల్లా.

"చంపారు. మనం ఇలా ఎంత సేపు నీళ్ళల్లో నిలబడతాం. వాళ్ళు వెనక్కు వెళ్ళకుంటే మనం ఇక్కడ సముద్ర జీవులకు ఆహారమైపోతాం" అన్నాను. చిన్న చిన్న జలచరాలు అప్పటికే మా కాళ్ళచుట్టూ చేరి రక్కటం, పీక్కుతినడం మొదలెట్టాయి.

"నాగరికత మాట ఎలావున్న వీళ్ళకు బుర్రలున్నాయి. అవి బాగా పనిచేస్తున్నాయి" అంది డెల్లా నమ్మలేనట్లు.

సముద్రం పైనుంచి దూరంగా ఎక్కడో ఏదో ఇంజన్ ఆడుతున్నట్లు శబ్దమైంది. వెనక్కితిరిగి తదేకంగా ఆలకించి విన్నాను. డెల్లా కూడా గమనించిందా శబ్దం.

"ఏదో మోటారు బోట్ లాగుంది. దూరంగా ప్రయాణం చేస్తూంది" అంది డెల్లా నాకేసి ఆశగా,ఆనందంగా చూస్తూ.

"అవును. వాళ్ళు ఇటే వస్తారేమో" అన్నాను ఆశగా అటే చూస్తూ.

ఎక్సయిజ్ వాళ్ళ చేతుల్లో చిక్కింది మొదలుకుని నా బ్రతుకు ఇంతవరకు 'ఖైదీ'గానే గడిచిపోయింది. నా పేరు రాజా జాన్ అయినా నాకు యీ ఖైదీ జీవితం మాత్రం తప్పటంలేదు.

ఆ శబ్దం చాలా దగ్గరయింది.

"మనవైపే వస్తుందా బోటు" అంది డెల్లా సంతోషంగా అరుస్తూ.

మాకు వినిపించిన శబ్దం వాళ్ళకూడా వినిపించినట్లుంది. పెద్దగా అరుపులు పెట్టడం కేకలు వెయ్యడం చేశారు. వాళ్ళ నాయకుడు కల్పించుకుని ఏదో చెప్పాడు.

తమాషాగా అందరూ గుమిగూడి వాళ్ళ గూడెంవేపు పరుగుతీశారు.

నాకు ఆశ్చర్యం వేసింది.

"ఎందుకలా వెళ్ళిపోతున్నారు?" అడిగింది డెల్లా.

"అదే నాకూ అర్థం కావడంలేదు. ఆ బోటు మహిమ వాళ్ళకు తెలిసినట్లుంది. అది వచ్చే టయిమ్‌కు ఇక్కడ వుండటం ప్రమాదమనుకున్నారేమో. వెళ్ళిపోయారు. అంటే ఆ బోట్‌లోవున్న వాళ్ళెవరో చాలా దుర్మార్గులయి వుండాలి. ఇంతకుముందు ఆ గుంపు మనుషుల్నెవర్నో చంపి వుంటారు. అందుకే వాళ్ళు భయపడి వెళ్ళిపోయుంటారు" అన్నాను.

"అయితే మనం కూడా వాళ్ళకు దూరంగా వుండటం మంచిది" అంది డెల్లా.

ఆమె అభిప్రాయం నాకూ నచ్చింది.

ఇంజన్ శబ్దం మాకు బాగా దగ్గరగా వినవచ్చింది.

ఇద్దరం నీళ్ళలోంచి ఒడ్డుకి గబగబా నడిచి, అక్కడ్నుంచి దూరంగా వున్న చెట్లవేపు పరుగెత్తాం.

అక్కడెక్కడన్నా చెట్లలో ఆ గుంపు పొంచి వుందేమోనని తుపాకులు సిద్ధంగా పెట్టుకునే వున్నాం.

ఎక్కడా వాళ్ళ జాడ కనుపించలేదు. వెళ్ళి ఒక చెట్టు మొదట్లో కూర్చున్నాం.

అక్కడ్నుంచి సముద్రపు ఒడ్డు కనుపిస్తుంది కానీ, చీకటి కావడంవల్ల దృష్టి దోషంగా వుంది.

సముద్రంమీద లైటు కనుపించింది. ఆ బోట్‌కు పెద్ద లైటుబిగించి వుండాలనుకున్నాను. ఆ లైట్ బాగా కాంతివంతంగా వుంది. పదినిముషాల్లో అది సముద్ర తీరానికి వచ్చేసింది.

రెండు మానవాకారాలు అందులోంచి దిగి ఒడ్డుకొచ్చి

నట్లు లీలగా కనుపించింది. కళ్ళు చిట్లించి, చీకటిని చీల్చుకుంటూ ఏకాగ్రంగా చూడసాగాను. డెల్లా కూడా నాలానే చూచేందుకు తంటాలు పడసాగింది.

"ఎక్కువమంది లేనట్లుంది?" అంది.

"ఇద్దరున్నట్లున్నారు?" అన్నాను చూపు తప్పించకుండా.

"ఇద్దరయితే భయపడవలసిన పనిలేదు. మన దగ్గరెటూ గన్స్ వున్నాయి. వాళ్ళేమన్నా పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే కాల్చి పారేద్దాం. బోటు దొంగిలించుకుని వెళ్ళిపోదాం. అందులో బహుశా తినేందుకు, త్రాగేందుకు అన్ని వస్తువులు వుంటా యనుకుంటాను" అంది డెల్లా.

త్రాగేందుకు అన్న పదంమీద కాస్త ఒత్తిడిచేసి చెప్పడంతో, విస్కీకోసం డెల్లా తప్పించుకుపోతోందేమో ననుకున్నాను.

ఆమె ప్రశ్నకు జవాబు చెప్పకుండా చూస్తూనే వున్నాను సముద్రంవేపు. వాళ్ళు సిగరెట్లు వెలిగించారు కాబోలు, కాలుతున్న నిప్పురవ్వల్లా ఎర్రని సిగరెట్ మొదళ్ళు కనుపించాయి.

"ఈ దీవికి వాళ్ళెందుకొచ్చి వుంటారు?" అడిగాను నేను.

"ఏమో? స్మగ్లింగ్ వ్యాపారానికి పనికొచ్చే వస్తువు లేవన్నా ఈ దీవిలో విరివిగా దొరుకుతాయేమో?" అన్నాను.

"మనం ప్రొద్దుట్నుంచి తిరిగాంగా! గంజాయి చెట్లు నాకు ఎక్కడా కనపడలేదు. మరి వజ్రాలు, మొదలైనవేవన్నా దొరుకుతాయేమో మనకు తెలీదుగా!" అంది డెల్లా.

అటువంటిదేదో వుండాలి. లేకుంటే ఇంతదూరం మోటార్ బోట్‌లో రావలసిన అవసరం ఆ ఆగంతకులకు ఎందు కుంటుం దనిపించింది నాకు. అయితే వాళ్ళ కిక్కడ గుంపులతో బాగా పరిచయం వుండి వుండాలి, వాళ్ళ భాష కూడా కొంతకు కొంతన్నా తెలుసుం టుంది.

నాకు వాళ్ళను కలుసుకుని మా పరిస్థితి వివరంగా చెప్పి, సాయం అడగా లనిపించింది. కష్టాల్లో వున్న వాళ్ళంకాబట్టి ఆ మాత్రం సాయం ఖచ్చితంగా చేస్తారన్న నమ్మకం ఏర్పడింది నాలో. వెళ్ళి వాళ్ళను కలుసుకుందా మనిపించిందప్పుడే. నా అభిప్రాయం డెల్లాకు చెప్పాను. డెల్లా కూడా సరేనంది. ఇద్దరం అక్కడ్నుంచి లేచాం. కాస్త ముందుకు నడిచాం.

బోట్‌లోంచి దిగిన ఇద్దరు వ్యక్తులు కాలుస్తున్న సిగ రెట్లు ముందుకు కదలి వస్తున్నట్లున్నాయి. గమనించాను.

"వాళ్ళిటే వస్తున్నారు?" అన్నాను.

"బహుశా గూడెం వేపు పోతున్నారు కాబోలు" అంది డెల్లా.

"ఇప్పుడే కలుసుకుందామా?"

"వద్దు! వాళ్ళను వెళ్ళి రానిద్దాం. వచ్చేందుకు ఎటూ రెండుగంటలు పడుతుంది. ఈలోగా బోట్‌లోకి వెళ్ళి ఏమైన తినేందుకుంటే ఆరగించి సిద్ధంగా కూర్చుందాం. వచ్చాక మాట్లాడుదాం. మనకు సాయం చేస్తామంటే సరే! లేకుంటే వాళ్ళను కాల్చయినా సరే మనం బోట్ దొంగిలించుకుని వెళ్ళిపోదాం!" అంద్ది డెల్లా.

ఇద్దరం ఒక పొదచాటున నక్కి కూర్చున్నాము.

మాకు వందగజాల దూరంగా నడిచివెళ్ళారు. కాస్త చూడగలిగాను.దగ్గరగా వచ్చాక. నల్లటి సూట్లు తొడు

కున్నారు. ఇద్దరి దగ్గరా గన్స్ వున్నాయి. మంచి పొడవుగా వున్నారు. దగ్గరగా చూస్తే గానీ ఏ దేశం వాళ్ళయిందీ తెలుసుకోవడం కష్టం. మమ్మల్ని దాటి వెళ్ళిపోయారు. ఆ తర్వాత పదినిముషాలు మౌనంగా అక్కడే కూర్చున్నాం.

డెల్లా లేచింది. నేనుకూడా లేచాను. ఇద్దరం సముద్రంవైపు నడవసాగించాం. మధ్య మధ్య తల త్రిప్పి వెనుకకు చూస్తే మా వెనుక ఎవరూ రావడం లేదన్న విషయం ధృవపరచుకుంటూ వడివడిగా అడుగులేయటం మొదలెట్టాం.

ఐదు నిముషాల్లో బోటుదగ్గర కొచ్చాం. మామూలుగా ఉపయోగించే మోటార్ బోట్లకన్నా కాస్త పెద్దదిగా వుంది. నీళ్ళల్లో దిగి దాని దగ్గర కెళ్ళాం. వెనుక వేపునుంచి లోనికి ప్రవేశించాం. లోప లెవ్వరూ లేరు. రెండు కేబిన్స్ వున్నాయి. రెండిటికీ తాళాలు వేసి వున్నాయి. ముందువేపు ఇంజన్ రూం వుంది. అందులోకి వెళ్ళి చూచాం. అక్కడా ఎవ్వరూ కనుపించలేదు. కాల్చి పారేసిన సిగరెట్ పీకలున్నాయి కుప్పగా పడి.

మూడు నీళ్ళ డ్రమ్స్ వున్నాయి వెనుక వేపు. ఒకదాని పైని మూత తొలగించాం. ముప్పాతిక డ్రమ్ నిండా నీళ్ళున్నాయి. క్రింద పడున్న ప్లాస్టిక్ మగ్‌తో ఇద్దరం చెరో రెండు మగ్గులు నీళ్ళు త్రాగాం. కడుపు నిండింది. త్రేనుపొచ్చింది.

నీళ్ళు త్రాగాక, మా ఒంట్లోకి క్రొత్త శక్తి, బలం, ఉత్సాహం ప్రవేశించినట్లు ఫీలయినాం.

"కాబిన్‌లో సామాన్లు పెట్టి తాళాలు వేసుకొని పోయారు. తియ్యాలంటే పగలకొట్టాల్సిందే!" అన్నాను.

"అపనే చేద్దాం!" అంది డెల్లా.

తుపాకీ మడమతో తాళంకేసి ఘట్టిగా నాలుగైదు సార్లు కొట్టాను. ఊడలేదది! ఇంకా బరువైన సామాను ఏదైనా దొరుకుతుందేమోనని బోటంతా వెదికాను. లావుపాటి పెద్దబోల్టు కనుపించింది. చేతికి తీసుకున్నాను.

నేను వచ్చేసరికి డెల్లా తన దగ్గరున్న తుపాకితో రెండో కాబిన్‌కు వేసివున్న తాళం పగులగొట్టేందుకు ప్రయత్నం చెయ్యసాగింది.

"వచ్చిందా?" అడిగాను.

"రాలేదు!" అంది తన ప్రయత్నం విరమించకుండానే.

నా ప్రయత్నం ప్రారంభించాను. అరడజను దెబ్బలు 'దభీ' 'దభీ' మని తాళం కప్పపై వేశాను. ఊడి పోయింది. బోల్టు దూరంగా విసిరి, ఎడంచేత్తో కప్పను లాగిపడేశాను. గొళ్లెం వెనక్కి లాగి తలుపులు తెరచాను. లోపలకు అడుగుపెట్టాను.

కాబిన్ వారగా సింగిల్ కాట్ వేసి వుంది. క్రింద మూడు నాలుగు ఇనుప పెట్టెలున్నాయి. ఒకమూలగా రెండు తుపాకీలు ఆనించి వున్నాయి. చిన్న టీపాయి మీద ఖాళీచేసిన విస్కీ సీసా, గ్లాసువున్నాయి. అంతలో డెల్లా కూడా కాబిన్‌లో కొచ్చింది.

మంచం క్రిందున్న ట్రంకుపెట్టె వెలుపలకు లాగాను. దానికి తాళంలేదు. మూత తెరచాను. లోపల సీల్ చేసిన టిన్స్ వున్నాయి. నాలుగు టిన్నులను వెలుపలకు లాగాను. వాటిపై నున్న లేబుల్స్‌కేసి చూశాను. అవి బాయిల్ చేసిన కోడిగుడ్ల టిన్నులని అర్ధం అయింది.

పై మూతలు లాగి లోపలున్న గుడ్లను వెలుపలికి తీసి ఇద్దరం తిన్నాం. మంచంపైన కూర్చునే, రెండో పెట్టె లాగి చూశాను. దాన్నిండా విస్కీ బాటిల్స్ వున్నాయి. ఒకసీసా తెరిచి చెరిసగం త్రాగాం.

మా ఇద్దరికీ ఆకలి తీరిపోయింది. ఉత్సాహం ఉరకలు వేసింది. మూలనున్న తుపాకీల్ని చెరొకటి తీసుకుని మా దగ్గరున్న గన్సును ఆ స్థానంలో పెట్టాము.

"వాళ్ళను బోటుకు దూరంగానే వుంచాలి. మనకు సాయం చేస్తామని మాటిచ్చాకే లోనికి రానివ్వాలి. వాళ్ళు వచ్చాక కూడా మనం వెయ్యి కళ్ళతో వాళ్ళను కనిపెట్టుకొని వుండాలి. తెలిసిందా?" అడిగాను డెల్లాను.

"తెలిసింది" అంది మూతి తుడుచుకుంటూ.

ఇద్దరం మంచంపైనే కూర్చుని, కిటికీలోగుండా సముద్రపు ఒడ్డుకేసి చూస్తున్నాం. ఆగంతకుల జాడలేదు.

కాలం గడిచిపోతుంది. మేము బోటులోకి ఎక్కి అప్పుడే నాలుగుగంటలు దాటిపోయింది. నిద్ర ముంచు కొస్తూ వుంది నాకు. డెల్లా కూడా దాదాపు నా స్థితిలోనే వుంది.

"ఏమయినట్లు? వాళ్ళ జాడలేదే?" అంది డెల్లా విసుగా.

"ఏమో?" ఏ ఆలోచన రాక అయోమయంగా చెప్పాను.

"నాకు నిద్ర వస్తూంది?" అంది డెల్లా.

"నువ్వు పడుకో! నేను మేలుకొనే వుంటాను. వాళ్ళు రావటం చూచాక లేపుతాను" అన్నాను.

డెల్లా తుపాకీ దూరంగాపెట్టి మంచంపైన పడుకుంది. మెత్తటి పరుపుమీద పడుకోగానే నిద్ర పట్టినట్లుంది. గురక రావటం ప్రారంభమైంది. నేను మాత్రం నిద్రను బలవంతంగా ఆపుకుంటూ, కిటికీ కేసి చూస్తూ కూర్చున్నాను.

అలా అరగంటకన్నా ఎక్కువసేపు కూర్చోలేక పోయాను. కళ్ళు బైర్లుక్రమ్ముకొచ్చాయి. విస్కీ త్రాగడం

పొరపాటయిందనుకున్నాను. దానివల్లే ఈ మత్తు పుట్టు కొస్తూందని అర్థమయింది.

ఇక లాభంలేదనుకుని లేచి కాబిన్ తలుపులు లోపల వైపునుండి మూసి, గడియపెట్టి, వచ్చి డెల్లా ప్రక్కనే పడుకున్నాను.

తుపాకీ చేతిలోంచి జారిపోయింది. శరీరం నిద్రలోకి ఒరిగిపోయింది.

'దబదబ' మంటూ తలుపులు బాదినట్లు లీలగా, దూరంగా, ఎక్కడో జరుగుతున్నట్లు వినిపించింది. లేచి చూద్దామనిపించింది. కానీ లేచేందుకు ఒంట్లో శక్తి చాలడంలేదు. కాళ్ళు ముడుచుకుని పడుకున్నాను.

మళ్ళా అదే శబ్దం! ఈమారు దగ్గరగా వినిపించింది.

నన్నెవరో పట్టుకుని ఊపినట్లయింది.

"రాజ్! రాజ్!" చెవిదగ్గర పిలుపు వినిపించింది.

కళ్ళు తెరచాను. ఎదురుగా డెల్లా నావైపు తిరిగి పైకి వంగి వుంది.

"ఏమిటి?" అన్నాను.

"వాళ్ళొచ్చినట్లుంది. తలుపులు కొడుతున్నారు" అంది భయంగా.

ఆ మాటలతో ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను. మత్తు వదలింది. క్రిందకు జారిపోయిన తుపాకీని చేతికి తీసుకున్నాను. మంచం దిగాను. తలుపులవైపు నడిచాను. వెళ్ళి దగ్గరగా నిలబడ్డాను.

"హూ ఈజ్ దట్ ఇన్‌సైడ్! ఓపెన్ ది డోర్!" ఇంగ్లీషులో అధికారికంగా, పెద్దగా అరచాడు ఆగంతకుడు.

"ఫ్రెండ్స్! మా ప్రాణాలకు భయంలేదని హామీయిస్తే తలుపులు తెరుస్తాం!" అన్నాను.

"మీ రెంతమంది?"

"ఇద్దరం!"

"ఎనీ లేడిస్!"

"యస్. వన్ లేడీ!" అన్నాను.

"మీ దగ్గర ఆయుధాలున్నాయా?"

"మీ తుపాకులు తీసుకొని సిద్ధంగా వుంచుకున్నాం. మమ్మల్ని మీతో బోట్ లో తీసుకెళ్ళాలి! అందుకు ఒప్పుకుంటేనే తలుపు తెరుస్తాం" చెప్పాను గట్టిగా.

అవతలి వేపునుండి సమాధానం లేదు. బహుశా వాళ్ళిద్దరూ సమాలోచనలు జరుపుతూండవచ్చుననిపించింది.

డెల్లా లేచి నా దగ్గర కొచ్చింది.

నా కుడికాలు తలుపుకేసి బలంగా నొక్కి పెట్టి వున్నాను. డెల్లా కూడా తలుపులకు ఆనుకుని నిలబడి, తన బలాన్నంతా వాటిపైకి మార్చి పళ్ళు బిగబట్టింది. అవతలి వేపునుండి తలుపు తెరిచేందుకు వాళ్ళకు వీలులేకుండా చెయ్యడమే మా ఉద్దేశ్యం.

"హాండ్సప్!" అంటూ వెనుక వేపునుండి పెద్ద కేక వినిపించింది. ఇద్దరం తలత్రిప్పి చూశాం. మెషిన్ గన్ కిటికీలోగుండా దూర్చి, మాకు గురిపెట్టి వున్నాడు ఒక ఆగంతకుడు.

చచ్చినట్లు చేతులు పైకెత్తాం.

"డ్రాప్ ది గన్" అరిచాడు మళ్ళీ.

తుపాకులు నేలమీదకు జారవిడిచాం.

"ముందుకు రండి. నాదగ్గరకు రండి!" అన్నాడు.

తోలుబొమ్మల్లా అతను చెప్పినట్లు చేశాం.

"ఆ కిటికీ మూసి వుండవలసింది!" అంది డెల్లా మెల్లగా.

"అవును! ఆ హడావుడిలో నేను గమనించలేదు'

విచారంగా చెప్పాను.

మా వివరాలు తెలుసుకోకుండానే మమ్మల్ని విరోధులు క్రింద జమకట్టి, మాతో కయ్యానికి దిగిన ఆ ఆగంతకులను గురించి ఆలోచించాను. వాళ్ళకు ఇంగ్లీషు తెలుసు. దాన్ని బట్టి వాళ్ళు ఏ యూరోపియన్ లేదా అమెరికన్ దేశానికో చెందిన వాళ్ళయి వుండాలి.

దేశంకాని దేశంలో తమ తోటి నాగరికులను కలుసు కున్నందుకు సంతోషం కలగడం సామాన్యంగా జరిగే పని కానీ వీళ్ళు మమ్మల్ని శత్రువులుగా పరిగణిస్తున్నారు.

మమ్మల్ని అంతకుముందు బంధించిన గుంపు గుర్తొచ్చింది. ఈ బోట్‌లో వచ్చిన వాళ్ళకూ, ఆ గుంపుకూ ఏదో సంబంధముండి వుండాలి. వీళ్ళు బోట్ దిగి ఆ గుంపు దగ్గరకే వెళ్ళి వుంటారు. అక్కడే మేము వాళ్ళ చేతుల్లో చిక్కడం, తప్పించుకోవడం తెలుసుకొని వుంటారు. తిరిగి ఇక్కడకు రాగానే తమ బోట్ కాబిన్ తాళం పగులగొట్టి వుండటం గమనించాక, మమ్మల్ని శత్రువుల క్రింద జమకట్టి వుంటారనిపించింది.

మా వెనక, మేము మూసిన కాబిన్ తలుపులు తెరచేం దుకు బ్రహ్మప్రయత్నం సాగుతోంది. దబదబమంటూ చప్పుడవుతూంది.

చెవులు గింగుర్లు ఎత్తేట్లు అరుపు వినిపించింది. వెంటనే తలుపులోంచి బరిసె ఒకటి దూరింది. అది నా వీపుదాకా వచ్చింది.

ఆ అరుపు నాకు పరిచయమైనదే! ఆ గుంపు వాళ్ళు కూడా ఇక్కడికొచ్చి వున్నట్లు అర్థం చేసుకున్నాను. ఇక మాకు చావు తప్పదు. కాళ్ళూ చేతులు వణకసాగాయి.

అంతకుముందు పడేసిన ఖాళీ టిన్నొకటి ఠెల్లా కాలికి తగిలింది. మెరుపులా తట్టిందా మెకు ఐడియా.

ఎడంకాలితో ఆ డబ్బాను చాచి తన్నింది. అది మంచం క్రిందనుండి స్పీడుగా వెళ్ళి కాబిన్‌కు అమర్చిన రేకు గోడపైనపడి 'థన్'మని శబ్దం చేసింది.

డెల్లా, రాజ్‌లపైన గురిపెట్టివున్న ఆగంతకుడు ఆ శబ్దం విని తలవెనక్కి త్రిప్పాడు. అదే అదనుగా ఇద్దరు మంచం క్రింద దూరాము. పాక్కుంటూ వెళ్ళి తుపాకీలు అందుకున్నాము.

ఆ ఆగంతకుడు మళ్ళా తలత్రిప్పి చూసేసరికి కాబిన్‌లో ఎవ్వరూ కనుపించలేదు. అదిరిపోయాడు.

"ఎక్కడున్నారు? పైకిలేవండి?" అరిచాడు.

కిమ్మనకుండా ఇద్దరం మంచంక్రిందే పడుకున్నాము.

"త్వరగా పైకి లేవకుంటే మంచంమీదకు కాలుస్తాను" అన్నాడు పెద్దగా.

ఇద్దరం నడుములు పైకెత్తాం ఒకేసారి. మాతోపాటు మంచంకూడా లేచింది. కిటికీకి అడ్డం వచ్చింది.

వెలుపలున్న వ్యక్తి 'థన్, థన్'మని నాలుగు రౌండ్లు ప్రేల్చాడు. గుండ్లు మంచంలోంచి దూసుకునిపోయి, ఎదురుగావున్న తలుపుల్లో రంధ్రం చేసుకుని, అటువైపు వెళ్ళాయి.

"అబ్బ!" అంటూ తలుపుల కటువైపు ఎవరో అర చారు.

"ఎవరికో గుండు తగిలింది. చచ్చినట్లున్నారు" అంది డెల్లా. నాకు నవ్వొచ్చింది.

"స్టాప్ ఫైరింగ్!" రెండో వ్యక్తి కాబోలు, మమ్మల్ని కవర్ చేస్తున్న వ్యక్తిదగ్గరకొచ్చి చెప్పటం మాకు వినిపించింది.

"ఏమయింది?" అడిగాడతను.

"ఒక నేటివ్ చనిపోయాడు. అదేంటి ఆ మంచం

అలా కిటికీకి అడ్డం వచ్చింది" అడిగాడు.

అతను అందాకా జరిగింది చెప్పాడు.

"లోపలున్నవారు గుండెలు తీసిన మొనగాళ్ళలా గున్నారు. అలా ఎంత సేపని ఆ కాబిన్ లోపలుంటారు. వెలుపలికి రావాలిగా! వచ్చినప్పుడే వాళ్ళ పని పడదాం. ముందు మన బిజినెస్ పూర్తి చేసుకుందాం రా!" అన్నాడతను.

"అంతేనంటావా?" అడిగాడు మమ్మల్ని కవర్ చేస్తున్న వ్యక్తి.

"ప్రస్తుతానికంతే!" అన్నాడు.

కిటికీ దగ్గరనుండి దూరంగా వెళ్ళిపోతున్నట్లు బూట్ల చప్పుడయింది. రెండునిముషాల్లో మంచం యధాప్రకారం వేసి, వెలుపలి కొచ్చాం ఇద్దరం. కిటికీ తలుపులు మూసి వేశాం. గడియలు పెట్టాం. లోపలంతా చీకటిగా వుంది.

తలుపులు తెరచే ప్రయత్నం కూడా మానేశాం. అంతకు ముందు అందులో గుచ్చిన బరిసె కూడా లాగేశారు. ఆ భాగంలో పెద్ద రంధ్రమయింది.

"అమ్మయ్యా! కాస్త తెరిపిచ్చారు!" అంది డెల్లా క్రింద నుండి విస్కీ సీసా అందుకుంటూ.

"మళ్ళీ త్రాగుతున్నావా?" అడిగాను.

"ఆఁ! కాస్త వేసుకుంటే ఉషారుగా వుంటుంది. మనం యీ గదిలో ఖైదీలమయ్యాం. మనల్ని ఎలాగూ చంపుతారు వీళ్ళు. ఈలోగా హాయిగా త్రాగుదాం!" అంది.

"పాపం నువ్వు ఇండియా చూడాలని బయలుదేరావు. అదేమో అసలు సాగలేదు! ఏమేమో చూస్తున్నావ్!" అన్నాను సానుభూతిగా.

—(సశేషం)